నేటి కందం-నేటికి అందం

అందరి కథినందనలను
చిందించుచు రాజనాథ సింహుండు మొగిన్
హిందూస్థాన్ షిప్ యార్డుకు
సుందరమైనట్టి నౌక " సూర్య" నొసంగెన్ !!

(రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విశాఖ వచ్చి హిందూస్థాన్ షిప్ యార్డ్ కు క్రొత్త నౌక "సూర్య" ను సమర్పణ చేశారు.దీని వలన తీర రక్షణ మరింత ధృడంగా ఉంటుంది)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

సర్కారు లబ్ధి కొరకు
చేపట్టిన సర్ క్రియలు
అవుతున్నవి విపక్షాల
ఆందోళన ప్రక్రియలు.
సీఈసీ పై నిరసన
చిలికి చిలికి గాలివాన
తుపానై సాగుతుంది
తొలిగేవరకు ఢిల్లీలోనా.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 14-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026.Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:63 పేజీలు:6 వెల: రూ.1/-

## 15 రోజుల్లో కారుణ్య నియామకాలు'..
## సింగరేణి కార్మికులకు భట్టి విక్రమార్క గుడ్‌న్యూస్

హైదరాబాద్, అక్టోబర్ 13: సింగరేణి కార్మికులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుడ్ న్యూస్ చెప్పారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు, కార్మికులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి కీలక ప్రకటనలు చేశారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిలో 38,738 మంది పర్మనెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు 29,715 మంది పని చేస్తున్నారని తెలిపారు. వారి సంక్షేమం కోసం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. సింగరేణిలో కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. మారుపేర్ల అంశానికి సంబంధించి 15 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వెళ్ళాల్సి వస్తోందని.. ఇకపై సింగరేణిలో ఏరియా ఆస్పత్రుల్లోనే మెడికల్ ఇన్వాలిడేషన్ పరీక్షలు చేసే సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు.

కరోనా సమయంలో విధులకు హాజరుకాకుండా డిస్మిస్ అయిన వారిని విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. వన్ టైమ్ ఆప్షన్ కింద వారికి అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. సింగరేణికి చెందిన 1250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామన్నారు. ఇప్పటికే ఆక్రమణలో ఉన్న వారిలో అర్హులకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. హౌసింగ్ కాలనీ నిర్మించి కార్మికులకు అందిస్తామని.. కార్మికుల సొంత ఇంటి కలను నిజం చేస్తామని చెప్పారు. నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరిట ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు.

ఏరియా హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని భట్టి స్పష్టం చేశారు. సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం మానవీయ కోణంలో తాము నిర్ణయం తీసుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సింగరేణి కార్మికులను బీఆర్ఎస్ దోపిడీ చేసిందని ధ్వజమెత్తారు. సింగరేణి ఎన్నికలు వస్తేనే బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తుకువస్తారా అని ప్రశ్నించారు. మారు పేర్ల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోలేదని నిలదీశారు. కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాల గురించి బీఆర్ఎస్ ఏనాడు ఆలోచించలేదని విమర్శించారు. 3389 పోస్టులు సింగరేణిలో భర్తీ చేశామని.. 4237 కారుణ్య నియామకాలు చేపట్టామని తెలిపారు. కోటి రూపాయల బీమా కల్పించి కార్మికులను అండగా నిలబడ్డామని ఉద్ఘాటించారు. మరోసారి కార్మికులను మోసం చేసేందుకు బీఆర్ఎస్ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను గులాబీ పార్టీ ఎందుకు పరిష్కరించలేదని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు.

## డీఎస్సీ-2008 నియామకాలపై హైకోర్టు తీర్పు.. మూడు పిటిషన్ల డిస్మిస్

హైదరాబాద్, అక్టోబర్ 12: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ 2008 ఉద్యోగాల నియామకాలపై తెలంగాణ హైకోర్టు తీర్పును వెలువరించింది. జీవో నంబర్ 28ను ప్రభుత్వం సవరించిన విధానాన్ని తప్పుబడుతూ హైకోర్టులో డీఎస్సీ అభ్యర్థులు, బీఈడీ అభ్యర్థులు మూడు పిటిషన్లను దాఖలు చేశారు. వీటిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. ఈ మూడు పిటిషన్లను డిస్మిస్ చేస్తూ తీర్పు ఇచ్చింది.

2008 డిసెంబర్ నాటి అసలు నోటిఫికేషన్ ప్రకారమే DSC-2008 ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని పలువురు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. మరోవైపు నోటిఫికేషన్ విడుదలైన తరువాత జీవో నంబర్ 28ను జారీ చేసి రూల్ 7కు ప్రొవిజన్ జోడించడం సరైంది కాదని బీఈడీ అభ్యర్థులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే తెలంగాణ, ఏపీ విడిపోయిన తర్వాత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నియామకాలను కొనసాగించాయని, ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు కూడా ఇచ్చాయని.. ఈ పరిస్థితుల్లో జీవో నంబర్ 28ను సవరించడం అంశంపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ.. మూడు రిట్ పిటిషన్లను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెల్లడించింది.

### ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశానుసారం
## ఎంఎల్‌సి ఓటింగ్ నమోదు ప్రక్రియ గ్రామాల ముఖ్య నాయకులతో బి ఆర్‌ఎస్ పార్టీ
## జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడీశ నాగ రమేష్ ముఖ్య సమావేశం

**రాజుపేట కేంద్రంగా , జిల్లా సీనియర్ నాయకులు ఎడ్లపల్లి నర్సింహారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న బాడీశ నాగరమేష్**

**రాజుపేట క్లస్టర్ పరిధి లోని మల్లూరు నుండి అక్కిన పల్లి మల్లారం వరకు గల వివిధ గ్రామాల ఎశ్రీఇ ఓటింగ్ నమోదు ప్రక్రియలో కొనసాగిన ముఖ్య నాయకుల సమావేశం**



ములుగు, అక్టోబర్ 13:(నేటినిజం ప్రతినిధి): బాడీశ నాగరమేష్ మాట్లాడుతూ మెయిన్ ఎజెండా రాకేష్ రెడ్డన్న గెలుపు, ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ ఎలా జరుపుకోవాలి దానికి కావలసిన డాక్యుమెంట్స్, చేసే ప్రాసెస్ గురించి వివరించడం జరిగింది

ప్రతి ఒక్కరూ మీ మీ గ్రామాలలో తిరుగుతూ మీ ప్రాంతంలో డిగ్రీ పూర్తయిన వాళ్ళు ఎంతమంది పూర్తి డీటెయిల్స్ కలెక్ట్ చేసి వారికి దగ్గరుండి అప్లై చేయవలసిందిగా చెప్పటం జరిగింది. మన బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన రాకేష్ రెడ్డి అన్నగారికి మనమంతా సపోర్ట్ గా ఉండి అత్యధిక మెజారిటీతో గెలిపించే దిశగా కష్టపడవలసిందిగా కోరడం జరిగింది

ఈ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, అసమర్ధ పాలన అప్పుడు ఎమ్మెల్సీ ఎలక్షన్లో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదనినిరుద్యోగ భృతి, స్కూటీలు, ఫీజు రియంబర్స్, ఉద్యోగంలో సపోర్ట్, నిరుద్యోగుల సమస్యలను రూపుమాపుతామని చెప్పి ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఈ విషయాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లవలసిందిగా కోరడం జరిగింది

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, సీనియర్ నాయకులు కర్రి శ్యాంబాబు, కోడె రాము, బండ్ల మధు ప్రసాద్, ఎండి రాయ సాహెబ్, కర్రీ శ్రీను, రాజుపేట గ్రామ అధ్యక్షులు చదలవాడ సాంబశివరావు, మండల మాజీ యూత్ అధ్యక్షులు గుమ్మల వీరస్వామి, మల్లూరు టెంపుల్ మాజీ చైర్మన్ పూజారి శ్రీనివాస్, ఎండి హుస్సేన్, కర్రి రామ్మోహన్, నిమ్మగడ్డ ప్రవీణ్, వివిధ గ్రామాల అధ్యక్షులు మునిగెల సాంబుల్, పుల్లారావు, సోయం ఈశ్వర్, చింత చంద్రరావు రూప భద్రయ్య మండల నాయకులు ,చిట్టిబాబు, బియాని శ్రీను, మంచాల నాగేంద్ర, మహేష్, రమేష్, సంతోష్, పూర్ణయ్య, గొప్ప చంద్రకాంత్, అశోక్, దామోదర్, బాలకృష్ణ, పుల్లారావు, ప్రశాంత్, ఆనంద్, పురుషోత్తం, రాజ్ కుమార్, నాగభూషణం, నరసింహారావు, తోలం కృష్ణ, సాంబశివరావు, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు

## ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి : కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 13: ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధి కారులను ఆదేశించారు. జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, ప్రత్యామ్నయ పంటల సాగు, విత్తనాల సరఫరా, వ్యవసాయ, విద్యుత్తు, మంచినీటి తదితర రంగాలపై ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. ఎల్ నినో వల్ల భూ గర్భ జలాలు, చెరువులు, ఇతర నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా కంది, మొక్కజొన్న, పెసలు, మినుములు, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పప్పుధాన్యాలు, నూనెగింజలు , చిరుధాన్యాల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్న యపంటల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## ఎండీఆర్ చార్జీ విధింపు వాయిదా!

హైదరాబాద్, అక్టోబర్ 13: యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ చార్జీల విధింపు వాయిదా పడింది. దీపావళి తరువాత ఈ చార్జీలు మొదలవుతాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తాజాగా ఓ ప్రకటనలో తెలిపింది. పండుగ సీజన్ నేపథ్యంలో వ్యాపార వర్గాల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. దీపావళి తరువాత అమలు తేదీ ఎప్పుడనేది మరోసారి ప్రకటిస్తామని పేర్కొంది. రూ.2 వేలకు పైబడిన కొన్ని వాణిజ్య యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ చార్జీ విధించేందుకు ఎన్‌పీసీఐ సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ నెల 12 నుంచి ఈ చార్జీలు అమల్లోకి రావాల్సి ఉన్నా పండుగ సీజన్‌లో వ్యాపారాలపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు ఈ చార్జీల విధింపును ఎన్‌పీసీఐ వాయిదా వేసింది.

వాణిజ్య డిజిటల్ చెల్లింపులపై ప్రాసెసింగ్ ఫీజు కింద ఈ చార్జీలను విధిస్తారు. డిజిటల్ పేమెంట్స్ నెట్‌వర్క్ నిర్వహణ కోసం ఈ చార్జీలను విధిస్తారని గతంలో కేంద్రం వివరణ ఇచ్చింది. ఈ చార్జీలను వాణిజ్య సంస్థలే చెల్లిస్తాయి. ఇక రైల్వే, టెలికం సేవలు, ఇన్సూరెన్స్, వ్యవసాయ రంగానికి సంబంధించిన పేమెంట్స్‌పై మాత్రం కేవలం రూ.5ల చార్జీనే విధిస్తారు. రూ.75వేలు ఆపై చెల్లింపులపై గరిష్ఠంగా రూ.300 ఎండీఆర్ మాత్రమే ఉంటుందని కూడా కేంద్రం చెప్పింది. ఎండీఆర్ చార్జీలతో పేమెంట్ నెట్‌వర్క్ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. సైబర్‌సెక్యూరిటీ వసతులు మరింత బలోపేతం అవుతాయని, మోసాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని చెప్పింది. యూపీఐ చెల్లింపు వ్యవస్థ నిర్వహణ వార్షిక ఖర్చులు రూ.20 వేల కోట్లని కూడా కేంద్రం గతంలో పేర్కొంది.

## మ్యాచ్‌లే కాదు.. సేవలోనూ సీఎస్‌కే ముందడుగు!

**రూ.కోటి విలువైన 63 మోటార్‌సైకిళ్ల విరాళం**
**సీఎస్‌కే సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అందజేత**
**ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతకు దోహదం**



చెన్నై, ఆంధ్రప్రభ: చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులకు రూ.కోటి విలువైన 63 మోటార్‌సైకిళ్లను అందజేసింది. సంస్థ చేపడుతున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ విరాళాన్ని అందించింది. చెన్నైలోని వేపేరిలో ఉన్న పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన అప్పగింత, ప్రారంభోత్సవ కార్యక్రమంతో వాహనాల బదిలీ ప్రక్రియ లాంఛనంగా పూర్తయింది.

చెన్నై పోలీస్ కమిషనర్ ఎ. అమల్‌రాజ్, సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ విభాగానికి వాహనాలను అధికారికంగా బదిలీ చేసిన సందర్భంగా వారిద్దరూ కలిసి మోటార్‌సైకిళ్ల శ్రేణిని జెండా ఊపి ప్రారంభించారు.

నగరవ్యాప్తంగా ట్రాఫిక్ అధికారుల పని సామర్థ్యాన్ని పెంచడం ఈ విరాళం ప్రధాన ఉద్దేశమని సంస్థ పేర్కొంది. ఈ మోటార్‌సైకిళ్లతో మెరుగైన పెట్రోలింగ్ నిర్వహించడంతోపాటు, చెన్నై రోడ్లపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, రోడ్డు భద్రతా నిబంధనలను సమర్థంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

విరాళంగా అందించిన 63 మోటార్‌సైకిళ్లు రెండు వేర్వేరు మోడళ్లకు చెందినవి. ట్రాఫిక్ విభాగంలో వివిధ విధులను నిర్వహించేందుకు అనుగుణంగా వీటిని ఎంపిక చేశారు. ఈ వాహనాల్లో అత్యధికంగా 38 హోండా షైన్ మోటార్‌సైకిళ్లు ఉన్నాయి. ఇవి తేలికపాటి వాహనాలు కావడంతో నగరంలోని అంతర్గత రహదారులపై ప్రయాణించేందుకు అనుకూలంగా ఉంటాయి. ముఖ్యంగా దట్టమైన ట్రాఫిక్, తరచూ వాహనాలు ఆగుతూ ముందుకు కదిలే పరిస్థితుల్లో వీటి వినియోగం సులభంగా ఉంటుందని భావిస్తున్నారు.

చెన్నై సూపర్ కింగ్స్ చేపడుతున్న వ్యవస్థీకృత కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగానే ఈ వాహనాలను అందించింది. సంస్థ తన వనరుల్లో కొంత భాగాన్ని చెన్నైలో పౌర, సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తోంది. ట్రాఫిక్ పోలీసులకు మోటార్‌సైకిళ్లను అందించడం ద్వారా సీఎస్‌కే సామాజిక బాధ్యత కార్యక్రమాలు నేరుగా రోడ్డు భద్రతతో అనుసంధానమయ్యాయి.

ముఖ్యంగా ఐపీఎల్ సీజన్‌లో మ్యాచ్‌లు జరిగే రోజుల్లో నగరవ్యాప్తంగా ట్రాఫిక్ రద్దీ పెరిగే నేపథ్యంలో రోడ్డు భద్రత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులకు అదనపు వాహనాలు అందుబాటులోకి రావడం పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ కార్యకలాపాలకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

వేపేరిలోని పోలీస్ కమిషనరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం, పోలీస్ కమిషనర్ ఎ. అమల్‌రాజ్, సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ స్వయంగా పాల్గొనడం ఈ కార్యక్రమానికి ఉన్న అధికారిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. సీఎస్‌కే, నగర పోలీసు యంత్రాంగం మధ్య ఉన్న సంస్థాగత సహకారాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది. ఇటీవలి కాలంలో ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ నగర పౌర యంత్రాంగానికి అందించిన గణనీయమైన సీఎస్ఆర్ విరాళాల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.

## ఎలివేటెడ్ కారిడార్ అనుమతులు వేగవంతం చేయాలి

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన మంత్రులు, ఎంపీ



మహబూబ్‌నగర్, అక్టోబర్ 13:నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో రోడ్లకు అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం సమర్పించారు.

ఃనాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కలిసి ఈ అభివృద్ధి ప్రతిపాదనలను అందజేశారు. ఎలివేటెడ్ కారిడార్ డీపీఆర్: జాతీయ రహదారి 765పై ప్రతిపాదిత మన్ననూర్?శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించిన డీపీఆర్ (ఆఖఖీ) ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అటవీ, వన్యప్రాణి అనుమతులను త్వరితగతిన మంజూరు చేయడంతో పాటు, నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కారిడార్ ద్వారా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు, ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఇతర పెండింగ్ అభివృద్ధి ప్రతిపాదనలను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు.

## అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రజల్లో అవగాహన ఎంతో అవసరం




హైదరాబాద్, అక్టోబర్ 13:సమాజంలో అవినీతిని అరికట్టడానికి ప్రజల్లో అవగాహన పెంపొందించడం చాలా అవసరమని, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారితనం ఉండాలని బలి వక్తలు సూచించారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం బలిజగూడ గ్రామంలో జరిగిన అవినీతి నిరోధక అవగాహన సదస్సులో వక్తలు మాట్లాడారు. అవినీతిన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ఉండాలని పిలుపునిచ్చారు. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ సంయుక్తంగా ఈ కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజలకు బీమా ప్రయోజనాలు ఎంత అవసరమో వక్తలు వివరించారు.

ఃఈనెల 9న బలిజగూడలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ ఇంకుబేషన్ మేనేజర్ టి సంధ్య, కళాశాల సస్టెయినబుల్ విభాగం ప్రతినిధి డాక్టర్ విజయ్ కుమార్‌తోపాటు నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సీఈఓ సంజయ్ కుమార్, విజిలెన్స్ ఏఓ కొప్పుల మహేష్ డీజీఎం లలిత, విజిలెన్స్ మేనేజర్ ఎస్ వీర్ కుమార్, తార్నాక బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.



# సామాజిక అసమతుల్యత కట్టడిలో ప్రమాణాలు

## (14 అక్టోబర్ "ప్రపంచ ప్రమాణాల దినోత్సవం" సందర్భంగా)

ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి సామాజిక అసమతుల్యతను పరిష్కారం, సుస్థిరమైన ఆర్థిక ప్రగతి సాధనకు, వాతావరణ మార్పుల రేటును తగ్గించడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల సహకారంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలు ఉపయోగపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రధాన అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమ తమ దేశాల ప్రమాణాలను నిర్ణయించుకుంటూ, అంతర్జాతీయంగా ప్రమాణాలను ఒకే రీతిలో అమలు చేయడానికి, ప్రమాణాల ప్రాధాన్యతను అవగాహన పరచుకోవడానికి ప్రతి ఏట 14 అక్టోబర్ రోజున "ప్రపంచ ప్రమాణాల దినోత్సవం (వరల్డ్ స్టాండర్డ్స్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 14 అక్టోబర్ 1946 రోజున లండన్ నగరంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు "అంతర్జాతీయ ప్రామాణిక సంస్థ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్)"ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భానికి గుర్తుగా 14 అక్టోబర్ రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని 1970 నుంచి జరుపుకుంటున్నాం.

### బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ స్థాపన :

ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్యదేశాలు ఉన్నాయి. 1947లో భారత్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టాన్ని ఆమోదించి దానిని శాసనపరమైన సంస్థగా మార్చి ఐఎస్ఐ ముద్రను ప్రకటించారు. ఈ సంస్థ మొదటి సారి మన జాతీయ పతాకం పొడవు, వెడల్పులను నిర్ణయించారు. అదే క్రమంలో మొదటిసారి వస్త్రాలు, ఇంజనీరింగ్‌లకు రెండు వేర్వేరు విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం వేదికగా ఆయా రంగాల్లో విశేష కృషి చేసిన వారిని స్మరించుకోవడం జరుగుతుంది. అంతర్జాతీయ వాణిజ్యం, భద్రత, జీవన నాణ్యతను పెంచడంలో ప్రామాణికరణ విశేష పాత్రను పోషిస్తున్నది. 2026 ప్రపంచ ప్రమాణాల దినోత్సవం ఇతివృత్తంగా "పరిపాలనా గణాంకాల ప్రయోజనాలను ఆవిష్కరించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

అంతర్జాతీయ మార్కెట్లో ప్రమాణాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ నుంచి సాంకేతికత వరకు అన్నిరంగాల్లో ఉత్పత్తులు, సేవలలో భద్రత, విశ్వసనీయత, నాణ్యత సమస్యలను ప్రభావవంతమైన ప్రమాణాలతో పరిష్కరించడం జరుగుతుంది. కొన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని వేరు వేరు తేదీల్లో నిర్వహిస్తున్నాయి. కొలతలు, సాంకేతికతలో ఏకరూపతను సులభతరం చేయడంలో ప్రమాణాలు ఉపయోగపడతున్నాయి.



-మధుపాళీ
9949700037

# కేలాంగ్‌లో తొలి హై ఆల్టిట్యూడ్ వైద్య, ప్రజారోగ్య పరిశోధనా కేంద్రానికి శంకుస్థాపన చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 13:ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో వైద్యం, ప్రజారోగ్య సేవలకు సంబంధించి హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్ - స్పితి జిల్లాలోని కేలాంగ్ వద్ద ఐసీఎంఆర్ ఏర్పాటు చేస్తున్న పరిశోధనా కేంద్రం (ఐసీఎంఆర్ - ఎ హెచ్‌ఏఎంపీ) నిర్మాణానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా 2026 అక్టోబర్ 12న శంకుస్థాపన చేసారు. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆరోగ్య పరిశోధన విభాగం ఆధ్వర్యంలో భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. భారతదేశంలోని ఎత్తైన పర్వత ప్రాంతాలు, వాతావరణ మార్పుల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలపై దృష్టి సారించి, వివిధ రంగాల సమన్వయంతో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని బలోపేతం చేయడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం.

హిమాలయ పర్యావరణ వ్యవస్థలో అధిక ఎత్తు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, కఠినమైన భౌగోళిక స్వరూపం, ఇతర ప్రాంతాలతో పరిమిత సంబంధాలు, వాతావరణంలో పెరుగుతున్న అనిశ్చితి వంటి కారణాల వల్ల ప్రజారోగ్యానికి ప్రత్యేకమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులు వ్యాధుల వ్యాప్తి తీరు, వైద్య సేవల లభ్యత, వృత్తిపరమైన ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ సవాళ్లతో కూడిన ప్రాంతాల్లో నివసించే, పనిచేసే ప్రజల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ఆధారాలను సేకరించడం, స్థానిక పరిస్థితులకు తగిన ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అభివృద్ధి చేయడం, వాటిని విస్తృత స్థాయిలో అమలు చేయడం వంటి కార్యక్రమాలను ఈ కేంద్రం బలోపేతం చేయనుంది.

ఈ కేంద్రం పరిశోధనల్లో భాగంగా ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మానవ శరీర ధర్మాలు, ఆ ప్రాంతాలకు శరీరం అలవాటు పడే ప్రక్రియ, పర్వత ప్రాంత వైద్యం, వాతావరణ మార్పులతో ప్రభావితమయ్యే వ్యాధులు, కొత్తగా వస్తున్న వ్యాధులు, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు, తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, పర్యావరణ, వృత్తిపరమైన ఆరోగ్యం, విపత్తుల సమయంలో అందించే వైద్య సేవలు వంటి అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నారు. మారుమూల ప్రాంతాలు, సులభంగా చేరుకోలేని ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు డిజిటల్ ఆరోగ్య వేదికలు, దూర ప్రాంతాల నుంచే వైద్య సలహాలు, సేవలు పొందే టెలిమెడిసిన్ విధానం, డ్రోన్ల ద్వారా వైద్య సామగ్రి సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థలను సమన్వయంతో వినియోగించే అవకాశాలను కూడా ఈ కేంద్రం పరిశీలించనుంది.

హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్ - స్పితి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ కేంద్రం - వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు ప్రాంతంలో నివసించే ఎత్తయిన పర్వత ప్రాంతాల ప్రజలు, గిరిజన సమూహాలపై నిరంతర క్షేత్రస్థాయి పరిశోధనలు చేపట్టేందుకు ఒక ముఖ్యమైన సంస్థాగత వేదికగా నిలవనుంది. దీని భౌగోళిక స్థానం వల్ల పర్యావరణ పరిస్థితులు, వాతావ రణ మార్పులు, ప్రజల ఆరోగ్యం పై వాటి ప్రభావాల మధ్య సంబంధాన్ని అధ్యయనం చేసేందుకు దీర్ఘకాలిక పరిశోధనలు నిర్వహించడం సాధ్యమవుతుంది. గిరిజనుల ఆరోగ్యం, విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధత, డిజిటల్ ఆరోగ్య రంగంలో నూతన ఆవిష్కరణలు, వాతావరణ మార్పులను తట్టుకోగల ఆరోగ్య వ్యవస్థల అభివృద్ధి వంటి జాతీయ ప్రాధాన్యతలకు ఈ కేంద్రం దోహదం చేయనుంది. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో వైద్య పరిశోధనలకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అధ్యయనాల్లో భారత్ పాత్రను కూడా ఇది మరింత బలోపేతం చేయనుంది.

ఈ కార్యక్రమం ద్వారా సాయుధ దళాల వైద్య సేవల విభాగం (ఏఎఫ్ఎంఎస్), భారత్‌లోని జాతీయ ప్రాధాన్యత కలిగిన పరిశోధనా సంస్థలు, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం మధ్య సంస్థాగత సహకారాన్ని ప్రోత్సహించనున్నారు. ఈ భాగస్వామ్యాలు అనువర్తిత పరిశోధన, శాస్త్రీయ విజ్ఞాన మార్పిడి, సామర్థ్య పెంపుదల, సాక్ష్యాధారిత విధానాల రూపకల్పనకు తోడ్పడతాయి. ఆరోగ్య పరిశోధనలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంతో పాటు, సమాజంలోని అన్ని వర్గాలకూ అందుబాటులో ఉండే, వాతావరణ మార్పులను తట్టుకో గల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల అభివృద్ధి దిశగా భారత ప్రభుత్వ దార్శనికతను ఇవి ముందుకు తీసుకెళ్లనున్నాయి.

శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా సాంప్రదాయ భూమి పూజ, ఫలకం ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం 'గ్రీన్ ఐసీఎంఆర్ క్యాంపస్' కార్యక్రమం కింద హిమాలయ ప్రాంతానికి చెందిన మొక్కలను నాటతారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం, ఈ కేంద్రం అధికారిక వీడియో, వెబ్‌సైట్ ఆవిష్కరణ, భవన నమూనా ప్రదర్శనతో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఒక ప్రత్యేక స్మారక పోస్టల్ కవర్‌ను కూడా విడుదల చేస్తారు.

ఈ శంకుస్థాపన కార్యక్రమానికి భారత ప్రభుత్వ రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, రాష్ట్ర శాసనసభ సభ్యుడు శ్రీ జైరామ్ ఠాకూర్, హిమాచల్ ప్రదేశ్‌లోని మండి పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి కంగనా రనౌత్, లాహౌల్ - స్పితి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ సభ్యురాలు శ్రీమతి అనురాధ రాణా, మాజీ శాసనసభ సభ్యుడు శ్రీ రవి ఠాకూర్ తదితరులు హాజరు కానున్నారు.

ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఇతర ప్రముఖుల్లో సాయుధ దళాల వైద్య సేవల విభాగం డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ సందీప్ థరేజా, ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి, ఐసిఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్, ఆరోగ్య పరిశోధన విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీమతి మనీషా సక్సేనా, ఐసిఎంఆర్ సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (పరిపాలన) శ్రీ వివేక్ కుమార్ దక్ష్, అదనపు డైరెక్టర్ జనరల్ (వెలుపలి పరిశోధనలు) డాక్టర్ అల్కా శర్మ, సీనియర్ ఆర్థిక సలహాదారు డాక్టర్ రిచా పాండే తదితరులు ఉన్నారు. కేంద్ర, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు, సాయుధ దళాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ప్రజారోగ్య నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, ఇతర కీలక భాగస్వాములు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# సీఈసీలకు పద్మ అవార్డుల్ని కాంగ్రెస్ లంచాలుగా ఇచ్చింది.. కేంద్ర మంత్రి పీయూష్ సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే అంటూ నిరసన చేపట్టిన కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత పీయూష్ గోయల్ సంచలన ఆరోపణలు చేశారు. గతంలో పని చేసిన సీఈసీలకు కాంగ్రెస్ లంచాలు ఇచ్చిందన్నారు. ప్రతిష్టాత్మక పద్మ అవార్డుల్ని సీఈసీలకు లంచంగా ప్రకటించిందని పీయూష్ విమర్శించారు. అలాగే, వారికి రాజకీయ పదవులు కూడా ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

పీయూష్ గోయల్ మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంచలన ఆరోపణలు చేశారు. సీఈసీలకు, ఈసీలకు కాంగ్రెస్ పదవులు ఇచ్చిందన్నారు. మాజీ సీఈసీ ఎంఎస్ గిల్.. ఎన్నికల సంఘం నుంచి పార్లమెంట్‌కు, అక్కడినుంచి కేంద్ర మంత్రిగా మారిన సంగతిని గోయల్ వివరించారు. అంతకుముందు సీఈసీగా కొనసాగిన టీఎన్ శేషన్ పదవీకాలం ముగిసిన వెంటనే గుజరాత్ గవర్నర్‌గా నియమించారని గోయల్ ప్రస్తావించారు.

2005లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నవీన్ చావ్లాను ఎన్నికల కమిషనర్‌గా నియమించడంలో సోనియా గాంధీ పాత్ర లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్‌గా ఉన్న చావ్లా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని 2009లో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్.గోపాలస్వామి ఆరోపించిన విషయాన్ని కూడా గోయల్ గుర్తు చేశారు. ఇదే సమయంలో ఇటీవల సీఈసీ రాజీనామా విషయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శల్ని, ఆయన తీరును పీయూష్ గోయల్ తప్పుబట్టారు.

రాహుల్ ప్రవర్తన ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తోందని, చిన్న పిల్లాడిలా ఆయన ప్రవర్తన ఉందని విమర్శించారు. ఎన్నికల సంఘానికి తమ ఎన్డీయే ప్రభుత్వం పూర్తి స్వతంత్రంగా పని చేసే స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు ఇవ్వలేదని వివరించారు.

చట్టపరమైన నిబంధనల్ని ఉల్లంఘించి, రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించలేదన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న సయ్యద్ అర్జుమంద్ అలీ



ఆదిలాబాద్, అక్టోబర్ 13: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమాంద్ అలీ నిర్మల్ పట్టణంలోని పలు కాలనీలో దుర్గామాత విగ్రహాలను దర్శించుకొని ఆర్థిక హార్థిక సహాయం అందజేశారు.

ఆయనతో పాటు పట్టణ అధ్యక్షుడు ఆకుల హరీశ్, కౌన్సిలర్ చిన్ను, జిల్లా మైనార్టీ చైర్మన్ జూనెద్ మెమన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్, కౌన్సిలర్ ఆకుల రామకృష్ణ, ప్రతాప్,నరేందర్,ప్రశాంత్, మణికంఠ, తదితరులు ఉన్నారు.

# ఎంజీయూ పీజీ, ఎంబీఏ సెమిస్టర్ ఫలితాలు విడుదల



నల్గొండ, అక్టోబర్ 13: మహాత్మాగాంధీ యూనివర్సిటీ, అనుబందంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పీజీ, ఎంబీఏ కళాశాలల 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం వర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ కొప్పుల అంజిరెడ్డి సీవోఈ డా. జి.ఉపేందర్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఫలితాల విడుదలలో పరీక్షల విభాగం అస్టెంట్ కంట్రోలర్స్ డా.లక్ష్మీప్రభ, డా. కళ్యాణి, డా.ప్రవలీక, డా.సంధ్యారాణి, పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాల విడుదల అనంతరం పరీక్షల నియంత్రణ అధికారి (సీవోఈ) మాట్లాడుతూ ఫలితాలను www.mguniversity.ac.in లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పీజీలో వివిధ కోర్సుల్లో 982 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 885 మంది ఉత్తీర్ణత (89.123 శాతం) సాదించగా 278 మంది ప్రమోట్ కాగా 21మంది విద్యార్థులు డిటెండ్ అయినట్లు తెలిపారు.

ఎంబీఏ, ఎంబీఏ (టిటిఎం)లో రెండో సెమిస్టర్ లో 243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 182 మంది ఉత్తీర్ణత సాధించగా 78 మంది ప్రమోట్ కాగా ఒకరు డిటెండ్ అయినట్లు వెల్లడించారు.

# సదర్ మాట్ సాగునీటి కోసం రైతుల నిరసన



ఆదిలాబాద్, అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా కడం మండలంలోని సదర్ మాట్ కాలువ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందకపోవడంతో నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పెద్దూర్ తండా రైతులు ఎండిపోయిన కుంటలో దిగి నిరసన తెలిపారు.

"సాగునీరు అందించండి మహాప్రభో" అంటూ నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టు పంటలకు సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే సాగునీరు అందించాలని కోరుతున్నారు.

ఈ సందర్భంగా రైతు నేత, సదర్ మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్ హపావత్ మాట్లాడుతూ.. చివరి ఆయకట్టు రైతుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, సంబంధిత అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతులు లావుడ్య గంగన్న, గుగ్లావత్ రాంధన్,భుక్య శేఖర్, వేణు, సుధాకర్, దేవేందర్, నరేందర్, రాంధన్, అనిల్, నవీన్, బాపురావ్, వేంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో అవకాశాలు

## -జిల్లా కేంద్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ: ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 13: ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగితేనే రాజకీయాల్లో అవకాశాలు వస్తాయని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే 22 ఏళ్ల వైద్య వృత్తిని వదిలి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రామస్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సంఘం జిల్లా నాయకుడు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించారు.

నాయి బ్రాహ్మణ సంఘ భవనానికి తన నిధుల నుంచి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జూనియర్ కళాశాల నిర్మాణం పూర్తయిన తర్వాత కళాశాల సెంటర్ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఉంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఏ గ్రామానికి చెందిన వారైనా అర్హుల జాబితాను అందించాలని సూచించారు. నాయి బ్రాహ్మణ సంఘంతో పాటు ఇతర సంఘాల భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కూడా తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం కావడంతో పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వివిధ శాఖల ద్వారా నిధులు మంజూరు చేయించి పలు భవనాల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. నూతన జూనియర్ కళాశాల భవనం, సఖి కార్యాలయం, నూతన బస్టాండు, వైద్య కళాశాల, విద్యుత్ శాఖ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.



# 2026 ఆసియా క్రీడల్లో రికార్డు స్థాయిలో 27 పతకాలు సాధించిన సర్వీసెస్ క్రీడాకారులను సత్కరించిన రక్షణ మంత్రి



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 13:జపాన్‌లో ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో 27 పతకాలు సాధించిన రక్షణ దళాల క్రీడాకారులను నేడు (అక్టోబర్ 12) రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సత్కరించారు. మొత్తం పతకాల్లో సైనిక క్రీడాకారులు 6 స్వర్ణాలు, 11 రజతాలు, 10 కాంస్యాలు సాధించారు. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ క్రీడా పోటీల్లో సాయుధ దళాల క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి కూడా హాజరయ్యారు.

మూడు సాయుధ దళాలకు చెందిన మొత్తం 92 మంది క్రీడాకారులు 19 క్రీడా విభాగాల్లో పోటీపడ్డారు. పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారు. మొత్తం భారత బృందం 85 పతకాలు సాధించగా.. వీటిలో 21 స్వర్ణం, 27 రజతం, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.

న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో క్రీడాకారులతో రక్షణ మంత్రి సంభాషించారు. క్రీడాకారుల విజయానికి క్రమశిక్షణ, కఠోర శ్రమ, జట్టు స్ఫూర్తి, క్రీడా నైపుణ్యమే కారణమని పేర్కొన్నారు. పతకం గెలుచుకునే ప్రయాణంలో అపారమైన అంకితభావం, తెల్లవారుజామున శిక్షణ, జిమ్ కార్యక్రమాలు, గాయాలు, కోలుకోవడం, నిరంతర ప్రయత్నాలు ఉంటాయని, ఇవన్నీ యూనిట్ విధులను, క్రీడా సన్నాహాలను సమతుల్యం చేసుకుంటూ, కుటుంబాలకు దూరంగా ఉంటూ చేయాల్సి వస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

పాల్గొని గెలవలేకపోయిన క్రీడాకారులను ఉద్దేశించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రయత్నాన్ని విరమించుకోవడంలోనే నిజమైన ఓటమి ఉంటుందని చెప్పారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా దేశానికి, రక్షణ దళాలకు గౌరవాన్ని తీసుకురావడంలో తోడ్పడ్డారని ఆయన పేర్కొన్నారు. రక్షణ దళాల క్రీడాకారుల సామర్థ్యంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, వారి విజయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారి సామర్థ్యాన్ని పెంపొందించడం, శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ అందించడం, ప్రపంచస్థాయి క్రీడా సదుపాయాలు కల్పించడం, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడంలో మిషన్ ఒలింపిక్ విభాగం కీలక పాత్ర పోషించిందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శిక్షకులు, సహాయక సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు, పోషకాహార నిపుణులు, క్రీడాకారుల కుటుంబాలు అందించిన సహకారాన్ని కూడా ఆయన గుర్తించారు. ఒక ఛాంపియన్ ఒక్కరి కృషితోనే తయారుకారని, దాని వెనుక ఎంతోమంది సమష్టి కృషి ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలో క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక శిక్షణ కేంద్రాల ఏర్పాటు, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడంపై నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనేవారి సంఖ్యను పెంచడమే కాకుండా, ప్రపంచ క్రీడా రంగంలో భారత్‌ను అగ్రగామి శక్తిగా నిలబెట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు.

భారత క్రీడారంగానికి సాయుధ దళాలు అందిస్తున్న గణనీయమైన సేవలను రక్షణమంత్రి ప్రస్తావించారు. శారీరక సామర్థ్యంతో పాటు క్రమశిక్షణ, సహనం, నాయకత్వ లక్షణాలు, క్లిష్ట పరిస్థితుల్లోనూ లక్ష్యాల పట్ల అచంచలమైన నిబద్ధత కలిగిన క్రీడాకారులను రక్షణ దళాలు నిరంతరం తీర్చిదిద్దుతున్నాయని రక్షణ మంత్రి అన్నారు.

2028లో లాస్ ఏంజిల్స్ వేదికగా జరగనున్న ఒలింపిక్స్ కోసం లక్ష్యంతో కూడిన, క్రమబద్ధమైన కార్యాచరణను అనుసరించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. క్రీడాకారులకు శిక్షకులు, సహాయక సిబ్బంది అంకితభావంతో, వృత్తిపరమైన నైపుణ్యంతో మార్గనిర్దేశం కొనసాగించాలని కోరారు. మరింత ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, 2028 లాస్ ఏంజిల్స్‌లో ఇంతకంటే మెరుగైన ప్రదర్శన కనబరచాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్ సాధించిన మొత్తం పతకాల్లో సాయుధ దళాల క్రీడాకారులు 32 శాతం పతకాలను అందించారు. భారత్ గెలుచుకున్న స్వర్ణ పతకాలలో 28.57 శాతం పతకాలు వీరి ఖాతాలోనే ఉన్నాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో నాయక్ సుబేదార్ నీరూ ధండా ఒకరు. అమె రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించారు. ఆసియా క్రీడల్లో మహిళల వ్యక్తిగత ట్రాప్ విభాగంలో స్వర్ణ పతకం గెలిచిన తొలి భారతీయ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. నాయక్ సుబేదార్ గుర్‌ప్రీత్ సింగ్ రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు. ఒకే ఆసియా క్రీడల్లో వ్యక్తిగత విభాగాల్లో మూడు పతకాలు గెలిచిన తొలి భారత పురుష ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడాకారుడిగా ఆయన ఘనత సాధించారు.

హవిల్దార్ సావన్ బర్వాల్ పురుషుల మారథాన్‌లో 2 గంటల 11 నిమిషాల 37 సెకన్ల జాతీయ రికార్డు సమయంతో రజత పతకం సాధించారు. దీంతో ఆసియా క్రీడల్లో మారథాన్ పతకం కోసం భారత్ 44 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు తెరపడింది. నాయక్ సుబేదార్ సర్వేశ్ కుషారే పురుషుల హైజంప్ విభాగంలో చారిత్రాత్మక పతకాన్ని సాధించారు. ఈ విభాగంలో భారత్‌కు 56 ఏళ్ల విరామం తర్వాత పతకం లభించింది.

## బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశానికి న్యూఢిల్లీ ఆతిథ్యమివ్వడం దేశానికి గౌరవం: కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:న్యూఢిల్లీలో రేపు జరగనున్న తొలి బిమ్‌స్టెక్ హోంమంత్రుల సమావేశానికి ఆతిథ్యమివ్వడం దేశానికి దక్కిన గౌరవమని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు.

'ఎక్స్' వేదికగా ఈ రోజు చేసిన ఒక పోస్టులో, కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు...

"13 అక్టోబర్ 2026న జరిగే బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశానికి న్యూఢిల్లీ ఆతిథ్యమివ్వడం దేశానికి దక్కిన గౌరవం.

గౌరవ హోంమంత్రులకు, సభ్య దేశాల ప్రతినిధి బృందాలకు నేను హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను.

ఉగ్రవాదం, అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాలతో పెరిగే తీవ్రవాదం, అక్రమ రవాణా, అక్రమ ఆర్థిక లావాదేవీలు, సైబర్ ముప్పును ఎదుర్కోవడంలో మన ఉమ్మడి సంకల్పాన్ని ఈ చరిత్రాత్మక సమావేశం స్పష్టం చేస్తుంది.

నిర్ణయాత్మక సమన్వయం ద్వారా సురక్షితమైన, బలమైన, మరింత భద్రమైన బిమ్‌స్టెక్ ప్రాంతాన్ని నిర్మించడానికి మేం కట్టుబడి ఉన్నాం."




# సైనికులకు 'భారత్ రైస్' పథకాన్ని ప్రారంభించిన భారతీయ సైన్యం

## పాల్గొన్న రక్షణ మంత్రి, వినియోగదారు వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 13:సాయుధ బలగాల కోసం 'భారత్ రైస్' (భారత్ బియ్యం) కార్యక్రమాన్ని భారతీయ సైన్యం నేడు.. అంటే 2026 అక్టోబర్ 12న.. న్యూఢిల్లీలో ప్రారంభించింది. కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు వినియోగదారు వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి శ్రీ ప్రల్హాద్ జోషి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వహణ కార్యకలాపాలపరంగా అత్యవసర స్థితులు ఎదురైనప్పుడు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు చెందిన మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడానికి ఉద్దేశించిన అవగాహన ఒప్పంద పత్రం (ఎమ్ఓయూ)పై భారతీయ సైన్యం, ఎఫ్‌సీఐ సంతకాలు చేశాయి. ఉన్నత నాణ్యత కలిగిన భారత్ బియ్యాన్ని లద్దాఖ్, ఈశాన్య ప్రాంతాల వంటి దూర ప్రాంతాలు సహా సైన్యానికి చెందిన సరఫరా డిపోలకు నేరుగా అందజేస్తారు. దీంతో సైన్య సరఫరా కేంద్రాలు స్థానిక ఎఫ్‌సీఐ కేంద్రాల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసే పని ఇక మీదట ఉండదు.

రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ, 'భారత్ రైస్' విశ్వాస బంధానికి ప్రతీక అన్నారు. ఈ బంధం రైతు పొలంలో మొదలై, జవాను కంచం వరకు విస్తరిస్తుందని వర్ణించారు. 'జయ్ జవాన్, జయ్ కిసాన్' భావనను ఈ కార్యక్రమం సాకారం చేస్తుందని ఆయన తెలిపారు. ఇది రైతు కష్టాన్ని సైనికుని శక్తిగా మార్చే ఓ సామూహిక సంకల్పాన్ని చాటిచెబుతుందని ఆయన అన్నారు. "అధిక నాణ్యతతో కూడిన బియ్యాన్ని నిర్ధారిత ప్రమాణాల ప్రకారం అందించడం జరుగుతుంది. దీనికి తోడు, మేం దీని ప్యాకేజింగును సరళతరంగా, సౌకర్యవంతంగా మార్చేటట్లు చర్యలు తీసుకుంటాం. ఈ కార్యక్రమం చూడటానికి చిన్నదిగానే కనిపించవచ్చు, కానీ దీంతో దూర ప్రాంతాలకు, చేరుకోవడం కష్టసాధ్యమయ్యే ప్రాంతాలకు ఆహారాన్ని చేరవేసున్న సైనికులకు ఎంతో ఊరట కలుగుతుంది'' అని మంత్రి వివరించారు.

'సైనికులు విధినిర్వహణలో కేవలం ఆయుధాలపై ఆధారపడితే సరిపోదు, వారు శారీరకంగా స్వస్థులుగా, మానసికంగా సమతౌల్యంతో, మనోబలం సహనశక్తితో ఉండాలి, ప్రత్యేకించి అత్యంత కఠినతర పరిస్థితుల్లో సేవ చేస్తున్న పక్షంలో ఇది మరింత ముఖ్యంగా మారుతుంది' అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. 'జవాన్ల సంక్షేమం ఏదో అప్రధానకరమైన అంశం కాదు, అది జాతీయ భద్రతతో ముడిపడిన అంశం' అని ఆయన అన్నారు. "పుష్టిని కలిగించే భోజనం, బలమైన సామగ్రి, సంపూర్ణ శిక్షణ.. ఇవి బలగాల మనఃస్థైర్యాన్ని ఇనుమడింప చేస్తాయి. దీంతో వారు ఏ సవాలుకైనా ఎదురొడ్డి నిలిచి, దేశాన్ని రక్షించడానికి తయారుగా ఉంటారు'' అని మంత్రి వివరించారు.

ఆధునిక యుద్ధంలో ఆయుధాలు, యుద్ధ సామగ్రి, సాంకేతికత మాత్రమే కీలక అంశాలు కావు, ఆధునిక రవాణా వ్యవస్థ దానంతట అదే ఒక యుద్ధ శక్తి అని రక్షణ మంత్రి ఉద్ఘాటించారు. ఇవాళ యుద్ధ విజయం ఒక్క రణరంగాల్లోనే సమకూరదు, అది సరఫరా వ్యవస్థల దృఢత్వం, నిల్వ సామర్థ్యం, రవాణా నెట్‌వర్కులు, గిడ్డంగి వసతులు, అవసరమైనప్పుడు సరుకును సకాలంలో అందజేసే సామర్థ్యాలు కూడా అంతే ప్రధానమని ఆయన అన్నారు.

"రాబోయే కాలంలో చోటు చేసుకొనే సంఘర్షణల్లో హెచ్చరిక చేసే సమయం ఎంతో తగ్గిపోనుందని ఆపరేషన్ సిందూర్ తాలూకు వ్యూహాత్మక విశ్లేషణలో బయటపడింది. మన అదుపులో ఉండని పరిస్థితులు, యుద్ధంలో సాంకేతికతను ఉపయోగించడం వంటి అంశాలు మన సన్నాహాలకు కఠిన పరీక్షను కొనితేవచ్చు. ఇలాంటి సంఘర్షణలు మన సరఫరా వ్యవస్థలను, సరఫరా నెట్‌వర్కుల స్థిరత్వాన్ని కూడా పరీక్షించవచ్చు. ఇందువల్ల, మన సైన్య కార్యకలాపాలను కొనసాగించడానికి బలమైన, ప్రతికూలతలకు తట్టుకొని నిలువగలిగిన లాజిస్టిక్స్ ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ఎఫ్‌సీఐతో ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ఈ దిశగా వేసిన ఒక ముఖ్యమైన అడుగు" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

ఎఫ్‌సీఐ దగ్గర దేశవ్యాప్తంగా కార్యకలాపాలను నిర్వహించడానికి కీలక ప్రాంతాలు సహా, గిడ్డంగులు, నిల్వకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆధునిక సైలోలు, సామగ్రిని చేరవేసే, దించే ఉపకరణాలు, వీటితో పాటు సుశిక్షిత సిబ్బంది ఉన్నారని రక్షణ మంత్రి అన్నారు. అవసరపడినప్పుడు దేశంలో ప్రస్తుత జాతీయ సామర్థ్యాన్ని దేశ భద్రత అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చనడానికి ఈ కార్యక్రమం ఒక నిదర్శనంగా నిలుస్తోందని ఆయన అన్నారు. ఇది రెండు విధాలుగా ఉపయోగించుకొనే భావనను ప్రతిబింబిస్తోందని, దేశ మౌలిక సదుపాయాలను, సామర్థ్యాలను ఒక ఉద్దేశానికే కాకుండా పౌర, సైన్య అవసరాలు రెండిటినీ కూడా నెరవేర్చడానికి ఉపయోగించుకో గలగడం దీనిలో భాగమని ఆయన అన్నారు.

పోరాట విమానాలను ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వే పై దించుతున్న విధంగానే, సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ) నిర్మించిన రోడ్లు, వంతెనలను స్థానికులు ఉపయోగించుకుంటున్నట్లుగానే, ఎఫ్‌సీఐ గోదాములు ఒక్క బియ్యం నిల్వకు మాత్రమే పరిమితం కాబోవని, ఆ గోదాములు భారతీయ సైన్య సరఫరా వ్యవస్థలో విడదీయలేని భాగంగా మారుతాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. "ఈ దృష్టికోణం ఒక్క వనరుల మెరుగైన ఉపయోగానికి పూచీపడడమే కాదు, జాతీయ దృఢత్వాన్నీ బలోపేతం చేస్తుంది. ప్రస్తుత మౌలిక సదుపాయాలను నిర్వహణ ప్రణాళికతో జోడించి కాలాన్ని ఆదా చేయగలుగుతాం, వనరులను మరింత ఎక్కువ ప్రభావవంతంగా ఉపయోగించుకోగలుగుతాం. ఈ ఒప్పందం పరిపాలనపరమైన సర్దుబాటు కన్న చాలా విస్తృతమైంది. ఇది సైన్య నిర్వహణ సావధానతను పటిష్టపరచడంలో కీలక భూమికను పోషిస్తుంది. అంతే కాదు, ప్రభుత్వంలోని అన్ని విభాగాలను, పూర్తి ప్రభుత్వాన్ని, పూర్తి దేశాన్ని ఏకతాటి మీదకు తీసుకు రావాలన్న మా దృక్పథాన్ని కూడా చాటుతోంది" అని ఆయన అన్నారు.

మన సైనికుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి ఒక్క అంశంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రక్షణ మంత్రి అన్నారు. ఆయుధాలు, సాంకేతికత మొదలు వస్త్రాలు, పరికరాలు, శిక్షణ వరకు అన్ని రంగాల్లో స్వయంసమృద్ధికి, ఆధునీకీకరణకు ప్రాధాన్యాన్ని ఇస్తున్నామని ఆయన అన్నారు. "ప్రస్తుతం భారత్ తన రక్షణ అవసరాలలో చాలా పెద్ద భాగం స్వదేశీ స్థాయిలో సమకూర్చుకుంటోంది" అని ఆయన తెలిపారు. 'నూతన ఆవిష్కరణలు, సమన్వయం ప్రాతిపదికలుగా సైనికులకు నిరంతరం అత్యుత్తమ నాణ్యతతో కూడిన సామగ్రిని అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసి ప్రతికూల పరిస్థితులను కూడా తట్టుకొని నిలిచేవిగా రూపొందిస్తున్నారు. ముందు వరుసలకు సకాలంలో సామగ్రిని అందేటట్లు చూస్తున్నారు. దేశ భద్రతకు పౌరసేవా ప్రధాన మౌలిక సదుపాయాలను మేలైన విధంగా ఉపయోగించుకుంటున్నారు' అని ఆయన వివరించారు. 'సైనికులు సరిహద్దులను కాపాడుతుంటారు కాబట్టి, తమ వెన్నంటి యావత్తు దేశం నిలబడుతుందన్న భరోసా వారికి ఏర్పడాలి' అని ఆయన అన్నారు. సైనికుల మనోబలాన్ని పెంపొందించడం ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. "ఈ నిబద్ధత ఒక్క ప్రభుత్వానిది మాత్రమే కాదు, రైతులు, సహకార రంగం, పౌర పాలనయంత్రాంగంతో పాటు పూర్తి దేశానిది కూడా" అని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా వినియోగదారు వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి శ్రీ ప్రల్హాద్ జోషి ప్రసంగిస్తూ, 'భారత్ రైస్' కార్యక్రమాన్ని ప్రశంసించారు. సాటి లేని సాహసాలు, అంకిత భావంతో దేశాన్ని రక్షిస్తున్న వారికి అత్యుత్తమ నాణ్యతను కలిగిన బియ్యాన్ని అందజేస్తుండడం తమ విభాగానికి గౌరవపూర్వకమైన విషయమని ఆయన వ్యాఖ్యానించారు. "దేశ రక్షకులకు మంచి భోజనం పెట్టడం, వారి అవసరాల పట్ల శ్రద్ధ తీసుకోవడం మా కర్తవ్యం" అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సైన్య ప్రధానాధికారి జనరల్ ధీరజ్ సేత్, ఆహార ప్రజా పంపిణీ కార్యదర్శి శ్రీ సంజీవ్ చోప్రా, రక్షణ శాఖ, వినియోగదారు వ్యవహారాల శాఖ, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ, ఎఫ్‌సీఐ, భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య ('నాఫెడ్'), సహకార రంగానికి చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### 'భారత్ రైస్' గురించి..

సరఫరాలు, రవాణా డైరెక్టర్ జనరల్ నాయకత్వంలో ఆరంభించిన 'భారత్ రైస్' కార్యక్రమం సైనికోద్యోగుల వద్ద నుంచి చాలా కాలం నుంచి అందుతున్న అభిప్రాయాల నుంచి స్ఫూర్తిని పొందింది. ఆహార పదార్థాల నాణ్యతను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం. 2026-27 ఆర్థిక సంవత్సరంలో, బియ్యాన్ని రక్షణ రంగం నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా మరాడిస్తారు. దీని సరఫరా బాధ్యతను నాఫెడ్ తీసుకుంటుంది. ఈ బియ్యాన్ని అవసరమైన నాణ్యత తనిఖీలను పూర్తి చేసి దీన్లో ఇతరాలేవీ కలవకుండా, నూక గాని, రంగు మారిన ధాన్యం గింజలు గాని కనీస స్థాయికి మాత్రమే పరిమితం అయ్యేటట్లు చూస్తారు.

పది కిలోలు, ముప్ఫై కిలోల సంచులలో కొనుగోలు చేసే కారణంగా, ఈ బియ్యాన్ని అనుకున్న చోట్లకు చేరవేయడం, దించుకోవడం మరింత సులభంగా మారుతుంది. సైన్యం, ఎఫ్‌సీఐ, నాఫెడ్, ఆహారం, ప్రజా పంపిణీ విభాగాల మధ్య సుమారు 18 నెలల సమన్వయం అనంతరం ఈ కార్యక్రమం కార్యరూపాన్ని దాల్చింది.

ఆపరేషన్ సిందూర్ సహా నిర్వహణ కార్యకలాపాలతో ముడిపడిన అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాల ఆధారంగా ఎఫ్‌సీఐతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఆపరేషన్ సిందూర్ వేళ అకస్మాత్తుగా ఎదురై దీర్ఘ కాలం పాటు కొనసాగిన అత్యవసర స్థితులు ఆధునిక రవాణా సంబంధిత ఏర్పాట్లు (లాజిస్టిక్స్ అరేంజ్‌మెంట్స్) సవాళ్లకు ఎదురొడ్డి నిలిచేటట్లు ఉండితీరాలని బోధించాయి. భారతీయ సైన్య నిర్వహణ కార్యకలాపాలకు సంబంధించి అత్యవసర స్థితులు ఎదురైన వేళ.. సరకు రవాణా, నిర్వహణలకు ఎఫ్‌సీఐ గిడ్డంగులను, ఉద్యోగులను, ఉపకరణాలను ఉపయోగించుకోవడానికి ఓ లాంఛనప్రాయ వ్యవస్థను ఈ ఒప్పందం అందుబాటులోకి తీసుకువస్తుంది.

సైన్యంలోని సరఫరా, రవాణా విభాగాలతో పాటు ఎఫ్‌సీఐకి చెందిన ప్రాంతీయ, విభాగీయ కార్యాలయాల మధ్య ప్రాథమిక స్థాయి సమన్వయాన్ని ఏర్పరిచారు. దీనిని నిర్వహణ సంబంధిత లాజిస్టిక్స్ ప్రణాళికలతో ఏకీకరించారు. ఈ ఒప్పందం 5 సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది. దీనిని పరస్పర అంగీకారం కుదిరిన మేరకు పొడిగించుకొనేందుకు కూడా వీలు ఉంది.

ఈ ఏర్పాటు.. అదనపు నిల్వ సదుపాయాల లభ్యతకు, వనరులను త్వరిత గతిన తరలించడానికి, రేషన్, సరఫరా, ఉపకరణాలను వేర్వేరు ప్రాంతాలకు పంపిణీ చేయడానికి, వాటిని నిర్వహణ క్షేత్రాల సమీపంలో అందజేయడానికి దోహదం చేస్తుంది. ఈ విధంగా, ఇప్పటి జాతీయ మౌలిక సదుపాయాలను మరింత మెరుగ్గా ఉపయోగించి సైన్య లాజిస్టిక్స్ వ్యవస్థ ప్రతిస్పందన సామర్థ్యాన్ని వేగిరపరచడమే కాకుండా దాని బలాన్ని పెంపొందింప చేయడం సాధ్యపడుతుంది. ఇది ప్రభుత్వంలో అన్ని విభాగాలను ఏకతాటి మీదకు తీసుకు రావాలన్న 'ప్రధానమంత్రి గతి శక్తి' దృష్టికోణానికి అనుగుణంగా ఉంది.

భారతీయ సైన్యం ఇటీవల కొన్ని సంవత్సరాల్లో రేషన్ నాణ్యతను, పరిమాణాన్ని మెరుగుపరిచే దిశగా అనేక చర్యలను చేపట్టింది. వీటిలో అగ్నివీర్ పథకంలో భర్తీ అయ్యే వారికి అదనపు రేషన్, త్రివిధ దళాల రేషన్ వ్యవస్థలో మరింత ఏకరూపతను తీసుకురావడం వంటివి భాగంగా ఉన్నాయి. సేంద్రియ ఆహార పదార్థాలను పరిచయం చేయాలన్న ప్రతిపాదన కూడా ఉంది.

## ఆసుపత్రుల్లో వైద్య సేవల ధరలను స్పష్టంగా ప్రదర్శించాలి.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం, రోగుల అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే విధానాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది. వైద్య సంస్థలు (ఆసుపత్రులు) అందించే సేవలు, సదుపాయాలకు వసూలు చేసే ధరలను స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది.

ఈ మేరకు కేంద్ర వైద్యశాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. వర్తించే నియంత్రణ నిబంధనల అమలును సమీక్షించాలని, వైద్య సేవల ఛార్జీలకు సంబంధించిన సమాచారం రోగులకు, వారి సహాయకులకు స్పష్టంగా కనిపించేలా, సులభంగా అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.వైద్య సేవల ధరల్లో పారదర్శకత ప్రాముఖ్యతను వివరిస్తూ.. ధరలను స్పష్టంగా ప్రదర్శించడం వల్ల చికిత్సకు అయ్యే ఖర్చు గురించి రోగులు, వారి కుటుంబ సభ్యులు ముందుగానే అర్థం చేసుకోవడానికి వీలవుతుందని కేంద్ర వైద్యశాఖ కార్యదర్శి పేర్కొన్నారు. దీనివల్ల సమాచారంతో వైద్య సేవలపై నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, వైద్య ఖర్చులను ముందుగానే ప్రణాళిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ధరల విషయంలో అధిక పారదర్శకత ఉంటే అనవసరమైన గందరగోళం, బిల్లులకు సంబంధించిన వివాదాలు తగ్గుతాయని, వైద్య సేవల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు.

ఈ లేఖలో వైద్య సంస్థల (నమోదు, నియంత్రణ) చట్టం 2010, వైద్య సంస్థలు (కేంద్ర ప్రభుత్వ) నిబంధనలు 2012 గురించి ప్రస్తావించారు. వైద్య సంస్థల నిర్వహణ కోసం ఈ చట్టం, నిబంధనలు నియంత్రణ వ్యవస్థను కల్పిస్తున్నాయి. ఈ చట్టం అమలులో ఉన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని వైద్య సంస్థలు.. తాము అందించే ప్రతి రకమైన వైద్య సేవకు వసూలు చేసే ధరలు, అందుబాటులో ఉన్న సదుపాయాల వివరాలను రోగులు, వారి సహాయకులకు స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలి. ఈ వివరాలు స్థానిక భాషతో పాటు ఆంగ్లంలోనూ ఉండాలని నిబంధనలు పేర్కొంటున్నాయి.

ఈ చట్టం వర్తించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వైద్య సంస్థలు ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సొంత చట్టాలు, నిబంధనల ప్రకారం నియంత్రణలో ఉంటాయి. వీటిలో చాలా చోట్ల కూడా వైద్య సేవలు, సదుపాయాలకు సంబంధించిన ధరలను ప్రదర్శించాలనే నిబంధనలు ఉన్నాయి.

వైద్యం రాష్ట్రాల పరిధిలోని అంశమని, సంబంధిత నియంత్రణ నిబంధనల అమలు, పర్యవేక్షణ బాధ్యత ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలదేనని కేంద్ర వైద్యశాఖ కార్యదర్శి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల ద్వారా నిబంధనలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను కోరారు.

వైద్య సేవల ధరల్లో పారదర్శకతకు సంబంధించి విదేశీ రోగుల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ లేఖలో సూచించారు. వైద్య వీసాలు లేదా ఆయుష్ వీసాలపై భారత్‌కు వచ్చే విదేశీ రోగులకు అందించే చికిత్స ప్యాకేజీల ధరలను, వర్తించే చోట స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరారు. దీనివల్ల విదేశీ రోగులు సరైన సమాచారంతో వైద్య సేవలను ఎంచుకోవడానికి వీలవుతుందని, ధరలు, బిల్లులకు సంబంధించిన ఫిర్యాదులు తగ్గుతాయని తెలిపారు. వైద్య, ఆయుష్ చికిత్సలకు విశ్వసనీయ గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై వ్యక్తిగతంగా దృష్టి సారించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను కేంద్ర వైద్యశాఖ కార్యదర్శి కోరారు. వర్తించే నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవల ధరలను స్పష్టంగా కనిపించే, సులభంగా చేరుకోగల ప్రదేశాల్లో ప్రదర్శించేలా సంబంధిత అధికారులు, వైద్య సంస్థలకు తగిన సూచనలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, రోగుల అవసరాలకు అనుగుణంగా అందించాలనే భారత ప్రభుత్వ నిబద్ధతను ఈ చర్య స్పష్టం చేస్తోంది. వైద్య ఛార్జీలకు సంబంధించిన స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండటాన్ని రోగులే కేంద్రంగా సాగే వైద్య సేవల్లో అంతర్భాగంగా మార్చడం ఈ కార్యక్రమం లక్ష్యం.

# పల్లె పలుకును పాటగా మలిచిన జనకవి జాలాది

తెలుగు సాహిత్య గగనంలో కొన్ని నక్షత్రాలు కవిత్వపు కాంతులతో మెరిస్తే, మరికొన్ని ప్రజల గుండెల చప్పుడై, వారి పెదవులపై పాటై అమరత్వాన్ని పొందుతాయి. సాంప్రదాయ కవిత్వపు పొలిమేరల నుంచి జానపద జీవన ముంగిట్లోకి సాహిత్యాన్ని నడిపించి, మట్టివాసనల సౌరభాన్ని వెండితెరకు అద్దిన అరుదైన గేయశిరోమణి జాలాది రాజారావు. పల్లె సీమల సహజ సౌందర్యాన్ని, సామాన్యుల బతుకు పోరాటాన్ని, పేదల అనుభూతులను తన కలానికి ఇంధనంగా మార్చుకున్న అక్షర శిల్పి ఆయన. జాలాది పాట ఒక శబ్ద సమ్మేళనం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ జీవన చిత్రం, ఒక సామాజిక దర్పణం, మానవ సంబంధాల అంతఃసూత్రం.

కృష్ణా జిల్లా గుడివాడ నేలపైన అమృతమ్మ, జాలాది ఇమ్మానుయేలు దంపతులకు 1932 ఆగస్టు 9న జాలాది రాజారావు జన్మించారు. తండ్రి స్వాతంత్ర్య సమర యోధుడిగా, జిల్లా బోర్డు సభ్యుడిగా అందించిన సామాజిక స్పృహ జాలాది వ్యక్తిత్వానికి పునాది వేసింది. ఎస్.ఎస్.ఎల్.సీ.లో తెలుగు ప్రత్యేక పాఠ్యాంశంతో ఉ ఉత్తీర్ణులైన ఆయన, చిత్రలేఖనం పట్ల ఉన్న ఆసక్తితో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంతో పాటు రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో పనిచేసిన కాలం ఆయన జీవితంలో కీలకమైన మలుపు. ఆయా ప్రాంతాల మాండలికాలు, మౌఖిక జానపద రూపాంతరాలు, ప్రజల నోటి పలుకు బడులను ప్రత్యక్షంగా శోధించి స్వీకరించే అవకాశం ఈ ఉద్యోగ జీవితమే కల్పించింది. అక్షరాలకు రంగులు అద్దే క్రమంలో ఆయనలోని కవిత్వం పరిణతి చెందింది. ఫలితంగా 1968లో ఉపాధ్యాయ వృత్తికి స్వస్తి చెప్పి, సాహిత్య సాధనకై మద్రాసు సినీ నికేతనానికి పయనమయ్యారు.



1976లో 'పల్లెసీమ' చిత్రంతో సినీ గేయ ప్రపంచంలోకి అడుగుపెట్టిన జాలాది, సంగీత దర్శకుడు కె.వి. మహదేవన్ స్వరకల్పనలో రాసిన "సూరట్టుకు జారతాది సిటుక్కు సిటుక్కు వాన చుక్క" పాటతో తెలుగు శ్రోతలను ఒక్కసారిగా పరవశింప జేశారు. ఆరంభంలోనే జానపద శైలికి కొత్త ఊపిరి పోసిన ఆయన, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో సుమారు 270కి పైగా చిత్రాలకు 1,500 నుండి 1,800 వరకు సజీవ గీతాలను అందించారు. గణాంకాలలో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, ప్రతి పాటలోనూ ఒక నాటుదనం, శ్రామిక సౌందర్యం నిండి ఉండటం ఆయన ప్రత్యేకత. 'మజూరి' శ్రమను 'మాధురి'గా మార్చడంలో జాలాది కలం సిద్ధహస్తుడు.

జాలాది గేయ సాహిత్యాన్ని పరిశీలిస్తే అందులో భావ కవిత్వపు లాలిత్యం, జానపదపు వాకిలి, సామాజిక దృక్పథాల త్రివేణి సంగమం కనిపిస్తుంది. "యాతమేసి తోడినా ఏరు ఎండదు" అని అమాయక రైతు హృదయాన్ని ఆవిష్కరించినా, "ఈ కాలం పది కాలాలు బతకాలనీ" అని కుటుంబ అనుబంధాల ప్రాశస్త్యాన్ని చాటినా, "పుణ్యభూమి నా దేశం నమో నమామి" అని దేశభక్తి నిండిన భావోద్వేగాన్ని విశ్వరూపంలో చూపించినా అది జాలాదికే సాధ్యమైంది. భావాన్ని క్లిష్టమైన గ్రాంథికంలో కాక, నిత్య జీవితంలో ఉపయోగించే తెలుగు నుడికారంలో, మాండలికాల సొబగులో పొదిగి చెప్పడం ఆయన రచనా వైశిష్ట్యం.

ఆయన ప్రతిభ కేవలం చలనచిత్ర రంగానికే పరిమితం కాలేదు. రంగుల లోకానికి రాకముందే 'విశ్వ మోహిని', 'కాకులమ్మ' వంటి కావ్యాలను, 'అమరజీవి', 'తండ్రి', 'సమాధి', 'కారు మేఘాలు' వంటి నాటకాలను రచించి రసజ్ఞుల మెప్పు పొందారు. ఉపాధ్యాయుడిగా పొందిన పరిశీలనా దృష్టి, కవిగా సాధించిన భావ పరిపక్వత, నాటకకర్తగా పండించిన సంభాషణా చతురత? ఈ మూడూ కలిసి ఆయనను అసాధారణ గేయ రచయితగా నిలబెట్టాయి.

ఈ సాహిత్య సేవలకు గాను ఆయనకు అనేక సత్కారాలు లభించాయి. విజయవాడ కల్చరల్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ కల్చరల్ అవార్డులతో పాటు 1987లో మద్రాసు కలాసాగర్ అవార్డు దక్కింది. 1990లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది పురస్కారంతో గౌరవించగా, తదనంతర కాలంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదును అందజేసింది. 2011 అక్టోబరు 14న విశాఖపట్నంలో ఆయన భౌతిక దేహాన్ని విడిచినప్పటికీ, ఆయన రాసిన పాటలు తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోయాయి.

కృత్రిమ అలంకారాల కన్నా సహజ అనుభూతికి, సంక్లిష్ట సమాసాల కన్నా పల్లె పదబంధాలకే జాలాది ప్రాణప్రతిష్ఠ చేశారు.

వెండితెరపై జనపదాల గొంతును నిలబెట్టి, పల్లె మనిషి ఆవేదనకు అక్షర రూపమిచ్చిన ఈ ప్రజాకవి, తెలుగు సినీ సాహిత్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన జానపద గేయశిరోమణిగా చిరస్మరణీయుడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# ధన్-ధాన్య కృషి యోజన అమలులో నాగర్‌కర్నూల్‌కు జాతీయ గుర్తింపు

## అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

## జాతీయ స్థాయి మైలురాయి వేడుకలకు హాజరైన జిల్లా ప్రతినిధుల బృందం




మహబూబ్‌నగర్, అక్టోబర్ 13:కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకం అమలులో నాగర్‌కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ పథకం అమలుకు సంబంధించి న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మైలురాయి వేడుకల్లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అవార్డు అందుకున్నారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్ఎస్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పురస్కారాన్ని స్వీకరించారు.

దేశంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, పంటల ఉత్పాదకతను మెరుగుపరచడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజనను అమలు చేస్తోంది. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమిస్తూ రైతులకు మెరుగైన సాగు అవకాశాలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.

ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన అమలులో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో జాతీయ స్థాయి మైలురాయి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నలుగురు సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం హాజరైంది. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఓ. శైలా, ప్రగతిశీల రైతు రాజేందర్ రెడ్డి ఈ బృందంలో పాల్గొన్నారు.

---

# మెదక్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం

## ఘటనపై రజక సంఘం నిరసన.. నిందితులను గుర్తించాలని డిమాండ్

మెదక్, అక్టోబర్ 13: మెదక్ జిల్లా కేంద్రంలో తెల్లవారుజామున చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కలకలం రేపింది. విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు భారీగా విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.

ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ మహేశ్ ఆధ్వర్యంలో విగ్రహం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రజక సంఘం నాయకులతో మాట్లాడిన సీఐ, ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలీసుల దర్యాప్తు త్వరలోనే పూర్తి చేసి బాధ్యులను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు ఘటనాస్థలికి చేరుకుని రజక సంఘం నాయకులకు మద్దతు తెలిపారు. మరోవైపు, విగ్రహం వద్ద సరైన కోణంలో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్న కెమెరాల దృశ్యాలు ఘటనను గుర్తించేందుకు ఉపయోగపడకపోవడంపై రజక సంఘం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారికంగా చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆమె విగ్రహానికి రక్షణ లేకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రజక సంఘం ఆధ్వర్యంలో మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

---

# భద్రకాళి చెరువు నాలా విస్తరణ పనులు వేగవంతం చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ, అక్టోబర్ 13:(నేటినిజం ప్రతినిధి) భద్రకాళి చెరువు వరద నీటి అవుట్ ఫాల్ రెగ్యులేటర్ పనులను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ కాపువాడలోని భద్రకాళి చెరువు కట్ట వద్ద చేపట్టిన నాలా విస్తరణ పనులను, భూ సేకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిగిలి ఉన్న భూ సేకరణ ప్రక్రియతో పాటు నాలా విస్తరణ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలా విస్తరణకు చేపట్టిన పనులను వేగవంతం చేయడంతో పాటు, మిగిలి ఉన్న భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, మున్సిపల్ ఎస్ఈ రాజ్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ రాంప్రసాద్, ఈఈ రవికుమార్, సీపీ రవీంద్ర రెడేకర్, ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై దృష్టి



వరంగల్, అక్టోబర్ 13:నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి మండలం బొల్లోనిపల్లి గ్రామంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్ ఆధ్వర్యంలో నూతన యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ అధ్యక్షుడిగా భోయిని రాము, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోటగిరి విజేందర్, ప్రధాన కార్యదర్శిగా హంసం మహేందర్, ఉపాధ్యక్షులుగా మోతుకురి పవన్, సిద్ద దినేష్, కార్యదర్శిగా కూన గణేష్ ఎన్నికయ్యారు. వీరితోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం సురేష్ మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని యూత్ కాంగ్రెస్ నాయకులు గ్రామస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. గ్రామంలోని డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఓటరు నమోదుకు అవసరమైన సమాచారాన్ని అందించి, నమోదు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

# రైతులకు కరెంట్ ఇవ్వలేని ప్రభుత్వం ఎందుకు?

## 53సీ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో

## రేవంత్ సర్కారుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర ఫైర్

వరంగల్, అక్టోబర్ 13:జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో 353సీ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

పంటలు చేతికొచ్చే కీలక దశలో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోయి పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చెల్పూర్ సమీపంలో 1,100 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఉన్నప్పటికీ, రైతులకు సరిపడా కరెంట్ ఇవ్వలేకపోవడం ప్రభుత్వ అసమర్థత అని విమర్శించారు. ఎరువుల కొరతతోనూ రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు.

రానున్న 15 రోజులపాటు ఎలాంటి కోతలు లేకుండా రోజుకు కనీసం 15 నుంచి 16 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పరిస్థితిని పరిశీలించాలని సవాల్ విసిరారు. ఈ నిరసన కార్యక్రమం కారణంగా రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---

# డిజిటల్ ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు పూణేలో భారతదేశపు తొలి డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించిన KONE



హైదరాబాద్, అక్టోబర్ 13: కోన్ ఎలివేటర్లు, ఎస్కలేటర్ల తయారీలో ప్రపంచంలోనే ప్రముఖ సంస్థ, భారతదేశంలో తన తొలి కోన్ డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ను ఈ రోజు పూణేలో ప్రారంభించింది. సాంకేతికత, డేటా, ఆవిష్కరణల ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన అనుభవాలను అందించాలనే సంస్థ లక్ష్యంలో ఇదొక ముఖ్యమైన మైలురాయి. ఈ కేంద్రాన్ని మిస్టర్ జుస్సీ హెర్లిన్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్, ఖూఔఇ కార్పొరేషన్; మిస్టర్ ఫిలిప్ డెలోర్మ్, ప్రెసిడెంట్ మరియు సీఈఓ, KONE మిస్టర్ నందన్ నీలేకని, సహ వ్యవస్థాపకుడు, బోర్డు చైర్మన్, ఇన్ఫోసిస్ సంయుక్తంగా ప్రారంభించారు.

KONE డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అనేది వినియోగదారులు సరికొత్త డిజిటల్ సాంకేతికతలను ప్రత్యక్షంగా చూసి, అనుభవించి, వాటి గురించి తెలుసుకునే ప్రత్యేక వేదిక. ప్రజల రాకపోకలను మరింత సులభతరం చేసే 'పీపుల్ ఫ్లో?' పరిష్కారాలు, స్మార్ట్ భవనాల భవిష్యత్తును తీర్చిదిద్దే డిజిటల్ సాంకేతికతలను ఇక్కడ తెలుసుకోవచ్చు. భవనాల నిర్మాణం నుంచి వాటి నిర్వహణ వరకు ప్రతి దశలో డిజిటలైజేషన్, కనెక్టివిటీ, కృత్రిమ మేధ , డేటా ఆధారిత విశ్లేషణలు ఎలా విలువను జోడించగలవో ఈ కేంద్రం ప్రదర్శిస్తుంది. ఇందుకోసం కోన్ తన వ్యాపార, సాంకేతిక, ఇంజనీరింగ్ నైపుణ్యాలను ఒకచోట చేర్చింది. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ కేంద్రంలో, భవనాల డిజైన్, అవసరాలకు అనుగుణంగా పరిష్కారాల ఎంపిక, ప్రోడక్టుల అనుభవం, డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లు, భవనాల నిర్వహణకు సంబంధించిన సమాచారం, రియల్ టైమ్ సేవా వివరాలను తెలుసుకునేలా వివిధ ఇంటరాక్టివ్ అనుభవాలను ఒకచోట చేర్చారు. భవన నిర్మాణం నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలో డిజిటల్ సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయో వినియోగదారులు ఇక్కడ తెలుసుకోవచ్చు. మెరుగైన నిర్ణయాలు తీసుకోవడం, పనుల్లో మరింత పారదర్శకతను సాధించడం, సేవలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలకు ఈ సాంకేతికతలు ఎలా తోడ్పడతాయో ఈ కేంద్రం వివరిస్తుంది.

---

# భూమిలేని నిరుపేదలకు భూములు ఇవ్వాలి




మహబూబ్‌నగర్, అక్టోబర్ 13: భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూములను పంపిణీ చేసి, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు గణిత, మానస డిమాండ్ చేశారు.

మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దజట్రం లో అక్టోబర్ 1 నుండి 16 వరకు ప్రపంచ ఆకలి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతో పాటు జీవనోపాధికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

---

# ఆర్థిక లక్ష్యాలకు 'వైవర్ ఆఫ్ ప్రీమియం' రక్షణ!

హైదరాబాద్, అక్టోబర్ 13: సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికలు ) వేసుకుంటారు. ఉద్యోగం క్రమంగా సాగుతుందని, జీతాలు వస్తూనే ఉంటాయని, తద్వారా పిల్లల చదువులు లేదా రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు కొనసాగించవచ్చని భావిస్తారు.

కానీ, జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఒకే వ్యక్తి సంపాదనపై ఆధారపడిన కుటుంబంలో, ఆ వ్యక్తి అకాల మరణం చెందితే కేవలం ఆదాయం కోల్పోవడమే కాకుండా, వారు అనుకున్న దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు కూడా ప్రమాదంలో పడతాయి. దీనిపై పాలసీబజార్.కామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వివేక్ జైన్ మాట్లాడుతూ.. "కుటుంబంలో సంపాదించే ఏకైక వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే, వారు నిర్దేశించుకున్న పెద్ద పెద్ద ఆర్థిక లక్ష్యాలు అర్ధాంతరంగా ఆగిపోతాయి. ఉదాహరణకు 20 ఏళ్లలో రూ. 1 కోటి కార్పస్ (నిధి) సమకూర్చుకోవాలని పెట్టుబడి ప్రారంభించి, కొన్నేళ్లకే ప్రీమియంలు ఆగిపోతే ఆ లక్ష్యం నెరవేరదు.

ఇలాంటి చోటే 'వైవర్ ఆఫ్ ప్రీమియం' కీలక పాత్ర పోషిస్తుంది. పాలసీదారుడు మరణించినా, మిగిలిన భవిష్యత్తు ప్రీమియంలను ఇన్సూరెన్స్ కంపెనీయే చెల్లించి, ఆ పెట్టుబడి లక్ష్యాన్ని అనుకున్నట్లుగా పూర్తి చేస్తుంది" అని వివరించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.